సమస్యల పరిష్కారానికి వేదికోలు

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వినతులు పోటెత్తుతున్నాయి. పలు గ్రామాల నుంచి ప్రజలు సోమవారం మండల కేంద్రాలు, సచివాలయాల్లో అర్జీలు అందజేశారు. ఈ మేరకు ఆయా శాఖల అధికారులు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



ఉదయగిరి : అర్జీలు స్వీకరించిన తహసీల్దార్ సుభద్ర

సద్వినియోగం చేసుకోవాలి

ఉదయగిరి : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సుభద్ర పేర్కొన్నారు. ఆమె తన కార్యాలయంలో సోమవారం పాల్గొని వివిధ సమస్యలపై అర్జీలు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ గ్రీవెన్స్‌డేకు అన్ని శాఖల అధికారులు హాజరు కావాలన్నారు. అర్జీలను ఆయా శాఖల అధికారులు సత్వరమే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలపై వినతి

ఆత్మకూరురూరల్ : సహకార సంఘంలో రైతులకు అనువుగా రుణాలు మంజూరు చేయడంతో పాటు పథకాల అమలులో మరింత పారదర్శకంగా పనిచేయాలని ఆత్మకూరు బీజేపీ నాయకులు నెల్లూరులో డీసీసీబీ చైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డిని సోమవారం కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కుడుముల సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ బ్యాంకుల ద్వారా ప్రస్తుతం రైతులకు రుణాలు రావడం కష్టతరంగా ఉన్న నేపథ్యంలో సహకార రంగం ద్వారా అవసరమైన రుణాలు, ఇతర సౌకర్యాలు పారదర్శకంగా అమలు చేయాలని కోరామన్నారు. కార్యక్రమంలో ఆత్మకూరు బీజేపీ పట్టణాధ్యక్షుడు నున్నా సంతోష్‌కుమార్, ఉపాధ్యాయ సంఘం నాయకుడు ఇందూరు వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దారిని ఆక్రమించారు


వినతిపత్రం ఇస్తున్న నాంచారమ్మపల్లి వాసులు

సీతారామపురం : మండలంలోని నాంచారమ్మపల్లి శ్మశానవాటికకు వెళ్లే దారి సమస్యను పరిష్కరించాలని కోరుతూ పలువురు స్థానికులు తహసీల్దార్ పీవీ కృష్ణారెడ్డికి సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొదట్లో ఆ మార్గం గుండా శ్మశానవాటికతో పాటు, పొలాల్లోకి వెళ్లేందుకు రహదారి ఉండేదని, కాలక్రమేణా పలువురు ఆ రహదారిని ఆక్రమించుకోవడంతో శ్మశానవాటికతో పాటు, పొలాల్లోకి వెళ్లేందుకు గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులతో పాటు ఎన్నో వ్యయ ప్రయాసలకు గురవుతున్నారన్నారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ దారి సమస్యకు త్వరలోనే పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు.

ఆర్డీఓ పరిశీలన



అల్లూరు : మండల పరిధిలోని నార్త్ మోపూరు, గ్రద్దగుంట గ్రామాల్లో కావలి ఆర్డీఓ వంశీకృష్ణ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీసర్వేలో వచ్చిన ఫిర్యాదుపై పరిశీలించినట్లు తెలిపారు. సమస్యను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. తహసీల్దార్ లక్ష్మీనారాయణ, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్లను నిషేధించాలి


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న జేవీవీ నాయకులు

ఉదయగిరి : ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని నిషేధించాలని జనవిజ్ఞాన వేదిక నాయకులు దస్తగిరి అహ్మద్, రామిరెడ్డి శ్రీనివాసులురెడ్డి కోరారు. స్థానిక పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో ప్లాస్టిక్ కవర్ల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అధికారులతో కలిసి వారు సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దుకాణదారులు స్వచ్ఛందంగా ప్లాస్టిక్ కవర్లను విక్రయించడం మానుకుని గుడ్డ సంచులు, జనపనార బ్యాగుల వాడకాన్ని ప్రజలకు అలవాటు చేయాలన్నారు. స్థానిక మేకపాటి వెంకటరెడ్డి కళాశాల యాజమాన్యం సుమారు 500 గుడ్డ సంచులను అందించిందన్నారు. కార్యక్రమంలో ఎస్సైలు కె.ఇంద్రసేనారెడ్డి, ఎ.శ్రీనివాసులు, డిప్యూటీ ఎంపీడీఓ కరీముల్లా పాల్గొన్నారు.

జనావాసాల నడుమ సమాధి

- టీడీపీ నేతలు బరితెగించి నిర్మించారు
- తొలగించాలని స్థానికుల విజ్ఞప్తి

అనుమసముద్రంపేట : జనావాసాల మధ్య నిర్మించిన సమాధిని తొలగించాలని స్థానికులు సోమవారం సచివాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. వారి వివరాల మేరకు.. ఏఎస్‌పేట మండలం కావలియడవల్లి గ్రామంలో మూడేళ్ల క్రితం టీడీపీకి చెందిన కె.వెంకటనారాయణ అనే వ్యక్తి చనిపోయాడు. ఈ క్రమంలో మృతదేహాన్ని అదే ప్రాంతంలో జనావాసాల మధ్యనే ప్రభుత్వ స్థలంలో టీడీపీ నేతలు ఖననం చేశారు. దీనిపై అప్పుడే రెవెన్యూ అధికారుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు కూడా నమోదు చేశారు. ఇది కేవలం పంచాయతీ స్థలమని, ఇక్కడ ఎవరు నిర్మాణాలు చేపట్టాలన్నా పంచాయతీ అధికారుల పర్యవేక్షణ ఉండాలని బోర్డును సైతం ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన క్రమంలో ఆ బోర్డును తొలగించి సమాధిని ఏర్పాటు చేశారు. నివాసాల పక్కన సమాధి ఉండడంతో పిల్లలు, వృద్ధులు భయాందోళన చెందుతున్నారని, ఈ మేరకు అధికారులు చర్యలు తీసుకోవాలని కావలియడవల్లి సచివాలయంలో వీఆర్వో మనోహర్‌కు స్థానికులు వినతిపత్రం అందజేశారు.


వీఆర్వోకు వినతిపత్రం ఇస్తున్న స్థానికుడు

ఆక్రమణల తొలగింపునకు సన్నాహాలు

చేజర్ల(ఆత్మకూరు) : చేజర్ల మండలంలోని ఆదూరుపల్లి నాలుగు రోడ్ల కూడలి కావడంతో ఆక్రమణలను తొలగించేందుకు తహసీల్దార్ బి.మురళి, రెవెన్యూ సిబ్బంది, రహదారులు, భవనాల శాఖ సిబ్బందితో కలిసి సోమవారం కొలతలు వేయించి మార్కింగ్ చేశారు. ఇక్కడ రోడ్డుకు ఇరువైపులా దుకాణదారులు, కొందరు గృహస్తులు రోడ్డును ఆక్రమించి పందిళ్లు, రేకులతో షెడ్లు ఏర్పాటు చేసుకోవడంతో 40 అడుగులు ఉండాల్సిన రోడ్డు 15 అడుగులకు కుచించుకుపోయింది. ఇటీవల వరుసగా నాలుగు రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకోవడంతో పలువురు ఫిర్యాదులు చేశారు. దీంతో అధికారుల్లో కదలికలు వచ్చి ఆక్రమించుకున్న స్థలాల్లో నిర్మాణాలు, షెడ్లను తొలగించేందుకు మార్కింగ్ చేశారు. మరో రెండు రోజుల్లో తొలగింపు ప్రక్రియను మొదలు పెట్టనున్నట్లు తహసీల్దారు మురళి తెలిపారు.


ఆక్రమణలను పరిశీలిస్తున్న అధికారులు

టాపర్లకు ప్రోత్సాహక బహుమతులు

సోమశిల : ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో అనంతసాగరం మండల పరిధిలో ప్రభుత్వ పాఠశాలల్లో మొదటి మూడు ర్యాంకులు సాధించిన విద్యార్థులకు సోమవారం ఎమ్మార్సీ కార్యాలయంలో సత్కరించారు. తొలి మూడు స్థానాల్లో నిలిచిన చిలకలమర్రి జెడ్పీహెచ్ఎస్ విద్యార్థి జ్ఞానేష్ (586), రేవంగి జెడ్పీహెచ్ఎస్ విద్యార్థి ఫణీంద్ర (563), వెంగంపల్లి జెడ్పీహెచ్ఎస్ విద్యార్థిని సానా హరిణి (559)లను దాత అయిన ఆపస్ మండల గౌరవాధ్యక్షుడు చెన్నూరు శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో ఒక్కో విద్యార్థికి రూ.5116 నగదు, జ్ఞాపిక, భరతమాత చిత్రపటాన్ని అందించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సుభాషిణి, ఎంఈఓ కె ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఆపస్ నేతలు వెంకయ్య, కృష్ణ, రాఘవరెడ్డి, వెంకటరమణారెడ్డి, శ్రీనివాసులు, జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.



వీర జవాన్‌కు నివాళి



సోమశిల : దేశ రక్షణ కోసం ఉగ్రవాదులతో పోరాడి వీరమరణం పొందిన మురళీనాయక్‌కు అనంతసాగరం గ్రంథాలయంలో సోమవారం నివాళులర్పించారు. ఈ మేరకు ఆయన చిత్రపటానికి లైబ్రేరియన్ నారాయణరావు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం విద్యార్థులతో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వేము పెంచలయ్య, మల్లు వెంకట్‌రెడ్డి, కేతా రవీంద్రరెడ్డి, పంటా రామిరెడ్డి, వసంత్‌కుమార్ పాల్గొన్నారు.

రెండు కార్లు ఢీ

- ఒకరికి గాయాలు



వరికుంటపాడు : వరికుంటపాడు మండలం విరువూరు సమీపంలో జాతీయ రహదారిపై సోమవారం రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొనడంతో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. సీతారామపురం మండలం దేవిశెట్టిపల్లి గ్రామానికి చెందిన జనపల్లి సుమంత్ కారులో హైదరాబాద్‌కు వెళ్తున్నాడు. మరో కారు విరువూరు నుంచి పామూరుకి వెళ్తుండగా అదుపు తప్పి రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో జనపల్లి సుమంత్ తలకు గాయాలయ్యాయి. మరో కారు డ్రైవరు అక్కడి నుంచి పరారయ్యాడు. ఎస్సై రఘునాథ్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



ఆత్మకూరురూరల్ : మండలంలోని అప్పారావుపాళెంలో ఓ గిరిజనుడి ఇల్లు విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా సోమవారం దగ్ధమైంది. ఈ ప్రమాదంలో ఇంటి సామగ్రితో పాటు ఆధార్, రేషన్‌కార్డు, గృహోపకరణాలు మొత్తం కాలి బూడిదయ్యాయని బాధితులు ఆవేదన చెందారు. ప్రభుత్వం, ఇతర స్వచ్ఛంద సంస్థలు ఆదుకోవాలని వారు వేడుకున్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

సీతారామపురం : మండల పరిధిలో మంగళవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు ఏఈ శ్రీహరి సోమవారం తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

దోమల మందు పిచికారీ

చేజర్ల(ఆత్మకూరు): చేజర్ల పీహెచ్‌సీ పరిధిలోని ప్రభుత్వ బాలుర వసతి గృహంలో దోమల నివారణ చర్యలను పీహెచ్‌సీ సిబ్బంది చేపట్టారు. ఈ మేరకు సోమవారం సీహెచ్‌ఓ చంద్రయ్య ఆధ్వర్యంలో దోమల నివారణకు స్ప్రే చేయించారు. ఏఎన్ఎం ప్రమీల, ఆశా కార్యకర్తలు వెంకటలక్ష్మి, పెంచలమ్మ పాల్గొన్నారు.

సోమశిల బస్టాండ్‌లో చలివేంద్రం ఏర్పాటు



సోమశిల : అనంతసాగరం మండల పరిధిలోని సోమశిల బస్టాండ్ సెంటర్‌లో చలివేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. శ్రీకాంత్ మిత్ర మండలి పేరిట చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, ఆటో యూనియన్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైభవంగా పెంచలస్వామి కల్యాణం



ఆత్మకూరు : స్థానిక బొగ్గేరు సమీపంలో కొలువైన పెంచల నరసింహస్వామి ఆలయంలో సోమవారం స్వామి, అమ్మవార్ల కల్యాణం వైభవంగా నిర్వహించారు. తొలుత స్వామివారి మూలవిరాట్‌కు విశేష పూజలు చేశారు. అనంతరం పెంచలస్వామి, ఆదిలక్ష్మి, చెంచులక్ష్మిల ఉత్సవమూర్తులను వేదికపై చేర్చి సుందరంగా అలంకరించారు. కల్యాణ ఘట్టాలను వివరిస్తూ ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా కార్యక్రమాన్ని పూర్తి చేశారు. భక్తులు అధిక సంఖ్యలో కల్యాణాన్ని తిలకించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది.

నృసింహునికి గరుడసేవ



వింజమూరు(ఉదయగిరి) : మండలంలోని నల్లగొండ్ల నీలగిరి కొండపై లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం బంగారు గరుడసేవ కనులపండువగా జరిగింది. రాత్రి వీరాంజనేయునికి సహస్ర నామార్చన చేశారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. నిర్వాహకులు లెక్కల చినకొండారెడ్డి దంపతులు పాల్గొన్నారు.

ప్రత్యేక ఆధార్ క్యాంప్ ప్రారంభం

ఆత్మకూరురూరల్ : మండలంలోని బట్టేపాడులో గిరిజనుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ క్యాంపును సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ జిల్లా ప్రాజెక్ట్ ఆఫీసర్ సుధాకర్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన కుటుంబాల వారికి ఆధార్‌కార్డులు మంజూరు చేసేందుకు కలెక్టర్ ఆనంద్ ప్రత్యేక చర్యలు చేపట్టారని తెలిపారు. ఇందులో భాగంగా బట్టేపాడులో ఆధార్ శిబిరాన్ని అందుబాటులోకి తీసుకొచ్చినట్లు చెప్పారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ డేవిడ్ పాల్గొన్నారు.

గాలివానకు నేలకూలిన విద్యుత్ స్తంభాలు



కొండాపురం : మండలంలో సోమవారం సాయంత్రం 5 గంటల సమయంలో ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. ఈ గాలులకు లింగన్నపాళెం నుంచి గానుగపెంటకు వెళ్లే మార్గంలో ఐదు విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. దీంతో ఆయా గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఆ సమయంలో ప్రజలు అక్కడ లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు.

అధికారుల తప్పిదం.. దివ్యాంగులకు సంకటం

ఆత్మకూరు : రాష్ట్ర ప్రభుత్వం పింఛన్లు పొందే దివ్యాంగులకు సంబంధించి సర్టిఫికెట్లను సదరం క్యాంపు ద్వారా మరోసారి పరిశీలించే కార్యక్రమం చేపట్టిన విషయం తెలిసిందే. ఈ క్యాంపులు బుధ, గురు, శుక్ర వారాల్లో మాత్రమే నిర్వహిస్తారు. ప్రస్తుతం సంగం మండలానికి చెందిన వారి సర్టిఫికెట్లను పరిశీలించే కార్యక్రమం ఆత్మకూరులో నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో సంగం మండలంలోని సచివాలయ సిబ్బంది, ఎంపీడీఓ చెప్పినట్లుగా సోమవారం సుమారు 20 మంది ఆత్మకూరు ప్రభుత్వ ఆస్పత్రికి వ్యయ, ప్రయాసలకోర్చి చేరుకున్నారు. అయితే బుధ, గురు, శుక్రవారాల్లో రావాల్సిన మీరు సోమవారం ఎందుకొచ్చారని డాక్టర్లు ప్రశ్నించారు. తమ మండలాధికారులు చెబితే వచ్చామని వారు సమాధానం ఇవ్వగా, ఈవిషయమై ఆస్పత్రి డాక్టర్లు సంగం ఎంపీడీఓను ఫోన్‌లో సంప్రదించగా తనకు సంబంధం లేదని, సచివాలయ సిబ్బంది పంపి ఉంటారని తెలిపారు. సచివాలయ సిబ్బందిని మానిటరింగ్ చేసే అధికారి ఎంపీడీఓ అనే విషయం గుర్తుచేయగా ఆమె నిర్లక్ష్యంగా సమాధానం చెప్పినట్లు డాక్టర్లు తెలిపారు. సదరం పరీక్షలు నిర్వహించాలంటే సంబంధిత డాక్టర్, కంప్యూటర్ ఆపరేటర్, సహాయ సిబ్బంది సిద్ధంగా ఉండాలని, షెడ్యూల్ లేని రోజుల్లో వస్తే పడే ఇబ్బందులను ఎంపీడీఓకు తెలిపి ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లమంటారా అని డాక్టర్లు తెలపగా మీ ఇష్టమొచ్చినట్లు చేసుకోండని ఆమె సమాధానం చెప్పినట్లు తెలిసింది. ఈ విషయం మరింత పెద్దదికాకుండా ఆస్పత్రి వైద్యులు అప్పటికప్పుడు సచివాలయ కంప్యూటర్ ఆపరేటర్‌ను, డాక్టర్‌ను పిలిపించి సదరం పరీక్షలు నిర్వహించినట్లు ఫిజియోథెరపీ వైద్యుడు చంద్రశేఖర్ తెలిపారు.


ఆత్మకూరు ప్రభుత్వాస్పత్రిలో సదరం వెరిఫికేషన్ కోసం వచ్చిన దివ్యాంగులు

నోటీస్ బోర్డు

కొత్త రేషన్‌కార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

వింజమూరు(ఉదయగిరి) : మండలంలో కొత్త రేషన్‌కార్డు పొందేందుకు ఆయా సచివాలయాల పరిధిలో దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ హమీద్ తెలిపారు. ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. రేషన్‌కార్డు పొందే వ్యక్తి తప్పనిసరిగా గ్రామంలో నివాసముండి హౌస్‌హోల్డ్ మ్యాపింగ్‌లో ఉండాలన్నారు. రేషన్‌కార్డులో చేర్పులు, మార్పులకు అవకాశం ఉందన్నారు.

ముస్లిం రుణాలకు..

కలిగిరి : ముస్లిం మైనార్టీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలకు సంబంధించి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ఎంపీడీఓ ప్రత్యూషారెడ్డి సోమవారం తెలిపారు. 21 నుంచి 55 ఏళ్లలోపు ముస్లింలు గ్రామ సచివాలయాలు, మీ–సేవా కేంద్రాల్లో ఆధార్, రేషన్‌కార్డుతో వెళ్లి దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

15న ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు..

అనుమసముద్రంపేట : ఏఎస్‌పేట మండలంలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఈనెల 15న ఉదయం 10.30 గంటలకు ఎంపీడీఓ కార్యాలయంలో పరిశీలన ఉంటుందని ఎంపీడీఓ ప్రసాద్ సోమవారం తెలిపారు. అభ్యర్థులు వారి ఒరిజినల్ సర్టిఫికెట్లతో రావాలన్నారు.

ముగిసిన రంగడి బ్రహ్మోత్సవాలు



సీతారామపురం : మండలంలోని పంద్రంగి గ్రామంలో ఐదు రోజులుగా జరుగుతున్న పాండురంగ విఠలేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించగా సాయంత్రం సీతారామపురం తూర్పువీధి వారు రథోత్సవం, పారువేట కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి పూజలు చేపట్టి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఇంద్రాక్షి అమ్మవారి సేవలో..

మర్రిపాడు: ఏపీ యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్ చుంచులూరు గ్రామంలో కొలువైన ఇంద్రాక్షి అమ్మవారిని సోమవారం దర్శించుకున్నారు. అర్చకులు సామవేద శిరోమణి, మురళీ కృష్ణమాచార్యులు, కమిటీ సభ్యులు ఇరుకుమారి మురళి, సత్యనారాయణ వివరించారు.

క్లుప్తంగా

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ఉదయగిరి రూరల్ : మండలంలోని పలు ఆలయాల్లో సోమవారం వైశాఖ పౌర్ణమి సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని శివాలయం, రామాలయం, గుడినరవ శివాలయం, గండిపాళెం పరమేశ్వర, దత్తాత్రేయ, అభయాంజనేయస్వామి, గంగమ్మ తల్లి ఆలయాల్లో భక్తులు పంచామృతాలతో అభిషేకాలు చేశారు. అర్చకులు స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఆలయ నిర్మాణానికి ఆర్థిక సాయం


నగదును అందిస్తున్న ట్రస్ట్ ప్రతినిధి

ఉదయగిరి రూరల్ : మండలంలోని గండిపాళెం గ్రామానికి చెందిన జీఎంకే ట్రస్ట్ అధినేత, మండల ఉపాధ్యక్షుడు గుంటుపల్లి మాలకొండయ్య చౌదరి వరికుంటపాడు మండలం యర్రంరెడ్డిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న కోదండరామస్వామి ఆలయ నిర్మాణానికి రూ.1,10,116లను సోమవారం అందించారు. ఈ నగదును తన ప్రతినిధి ద్వారా స్థానికుడు సోమిశెట్టి గోపికి అందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధి బి.వెంకటేశ్వర్లు, స్థానికుడు సీహెచ్.లక్ష్మయ్య పాల్గొన్నారు.

రామిరెడ్డి పరామర్శ


సతీష్‌రెడ్డి కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి (జలదంకి): కావలి పట్టణ వైఎస్సార్‌సీపీ నాయకుడు అల్తూరు సతీష్‌రెడ్డిని పుల్లారెడ్డి నగర్‌లో ఉన్న ఆయన నివాసంలో మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. సతీష్‌రెడ్డి తల్లి ఇటీవల మృతిచెందడంతో వారి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అలాగే కావలి రూరల్ మండలం గౌరవరం గ్రామానికి చెందిన వినుకొండ శ్రీనివాసులు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో అతని నివాసానికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు.

నేత్రపర్వంగా సీతారాముల కల్యాణం

ఉదయగిరి రూరల్ : మండలంలోని బండగానిపల్లి పంచాయతీ కృష్ణారెడ్డిపల్లిలో ఉన్న కోదండరామస్వామి ఆలయంలో సీతారాముల ఉత్సవాల్లో భాగంగా చివరిరోజు సోమవారం కల్యాణ మహోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. తొలుత స్వామివార్లను ముస్తాబు చేసి చలువ పందిరి వద్దకు తీసుకొచ్చి వేదపండితులు శాస్త్రోక్తంగా కల్యాణ తంతును పూర్తి చేశారు. అనంతరం వసంతోత్సవం నిర్వహించి గ్రామోత్సవంగా ఉత్సవమూర్తులను పారువేట చేపట్టారు.

వైభవంగా కుంభాభిషేక మహోత్సవం

సంగం : మండలంలోని కోరిమెర్ల గ్రామంలో నాగవరపమ్మ, పోలేరమ్మ తల్లి కుంభాభిషేక మహోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి ప్రత్యేక హోమాలు, పూజలు చేశారు. వేద పండితులు పవిత్ర జలాన్ని భక్తులపై చల్లారు. పెద్దసంఖ్యలో స్థానికులు అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. నిర్వాహకులు వడ్లమాని చిన్న కొండస్వామినాయుడు, గద్దె మాల్యాద్రియాదవ్ పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశం రేపు

సంగం : మండల సర్వసభ్య సమావేశం ఈనెల 14న బుధవారం ఉదయం 10.30 గంటలకు ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ షాలెట్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్వసభ్య సమావేశంలో అజెండాలో పొందుపరిచిన అంశాలపై సమీక్షిస్తామని, ప్రజాప్రతినిధులు, మండలస్థాయి అధికారులు సమావేశానికి హాజరుకావాలని కోరారు.

మండలాలకు పాఠ్య పుస్తకాలు

ఉదయగిరి : 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి మండలానికి సెమిస్టర్–1 పాఠ్యపుస్తకాలు చేరినట్లు ఎంఈఓ–2 తోట శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి విడతగా 14,500 పాఠ్య పుస్తకాలు వచ్చాయన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని ప్రత్యేక గదిలో భద్రపరచామన్నారు.

- **వింజమూరు (ఉదయగిరి):** విద్యావనరుల కేంద్రానికి 15,093 పుస్తకాలు అవసరం కాగా, ప్రస్తుతం 13,844 పుస్తకాలు వచ్చినట్లు ఎంఈఓ మధుసూదన్‌రెడ్డి తెలిపారు.
- **సీతారామపురం :** మండల విద్యా వనరుల కేంద్రానికి 8,408 పాఠ్యపుస్తకాలు సోమవారం చేరినట్లు ఎంఈఓ మస్తాన్‌వలీ తెలిపారు. ఇప్పటికే 1,292 బెల్టులు వచ్చాయన్నారు.